సాక్షి పల్నాడు

మంగళవారం । 11 । ఫిబ్రవరి । 2025



కలెక్టర్‌ను కలసిన పరిశీలకురాలు

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణా, గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గ ఎన్నికల పరిశీలకురాలు వి.కరుణ సోమవారం కలెక్టర్ నాగలక్ష్మిని కలిశారు. ఎన్నికల నిర్వహణపై చర్చించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 544.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 10.040 క్యూసెక్కులు విడుదలవుతోంది.



ముగిసిన బ్రహ్మోత్సవాలు

నగరంపాలెం: గుంటూరు అరండల్‌పేటలోని హంపి పీఠపాలిత గంగామీనాక్షి సోమసుందరేశ్వరాలయం వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. హోమం నిర్వహించారు.

న్యూస్‌రీల్

నులిపురుగులను నులిమేద్దాం

కలెక్టర్ అరుణ్‌బాబు



ముప్పాళ్ళ: జాతీయ నులిపురుగు నివారణ దినం సందర్భంగా ఏడాది నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరి చేత తప్పనిసరిగా ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని కలెక్టర్ అరుణ్‌బాబు చెప్పారు. మండలంలోని ముప్పాళ్ళ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన జాతీయ నులిపురుగు నివారణ దినం కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులతో మాత్రలు మింగించారు. నులిపురుగులు పిల్లలలో ఎదుగుదలను నియంత్రిస్తాయని చెప్పారు. ఏటా రెండు సార్లు ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలోనూ, అంగన్‌వాడీ కేంద్రాలలోనూ మాత్రలు అందిస్తారని చెప్పారు. ఈ రోజు మింగలేని వారు రెండో విడతగా 17వ తేదీన మాత్రలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా.రవి, జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ, సత్తెనపల్లి ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేశ్వరి, తహసీల్దార్ ఎమ్.భవానిశంకర్, ఎంపీడీవో పీ.జే.విలియమ్స్, పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.రమాదేవి, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

128 కేంద్రాల్లో టెన్త్ పరీక్షలు



నరసరావుపేట: జిల్లాలో మార్చి 17 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలు 128 కేంద్రాల్లో నిర్వహించనున్నామని జిల్లా రెవెన్యూ అధికారి ఎ.మురళి వెల్లడించారు. సోమవారం కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. రెగ్యులర్, ఓపెన్ స్కూల్ విధానంలో కలిపి మొత్తం 26,597 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. వీరిలో ఓపెన్ స్కూల్ విధానంలో 1,200 మంది రాయనున్నారన్నారు. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాలు, స్పాట్ వాల్యుయేషన్ కేంద్రంలో మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ బాధ్యతలను నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ జస్వంత్‌రావుకు అప్పగించారు. ప్రతి పరీక్షా కేంద్రం వద్ద ఒక హెల్త్ అసిస్టెంట్‌ను అందుబాటులో ఉంచాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఏ పరీక్షా కేంద్రానికి అయినా చేరుకునే విధంగా కీలక ప్రాంతాల్లో మెడికల్ వ్యాన్లను సిద్ధంగా ఉంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవిని ఆదేశించారు. విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా బస్సులు నిర్వహించాలని ఆర్టీసీ ప్రతినిధులను కోరారు. డీఈవో ఎల్.చంద్రకళ, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేడిగా ఆహారం అందించాలి



ముప్పాళ్ళ: విద్యార్థులకు రుచిగా వేడిగా ఆహారాన్ని అందించాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ, డీఎంహెచ్‌ఓ రవి చెప్పారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని మధ్యాహ్న భోజనాన్ని సోమవారం పరిశీలించారు. ప్రతి విద్యార్థి పాఠశాలలో అందించే ఆహారాన్ని తినేలా తయారు చేయాలని ప్రధానోపాధ్యాయురాలు నాగేంద్రమ్మకు, నిర్వాహకులకు సూచించారు. ఆహారాన్ని పాఠశాలలోనే తయారు చేయాలని, మెనూ ప్రకారం అందివ్వాలన్నారు. ఇంటి నుంచి క్యారేజీలు తీసుకు రాకుండా చూడాలన్నారు. ముందు ఉపాధ్యాయులు రుచి చూసిన తర్వాత విద్యార్థులకు అందివ్వాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి పీ.రమాదేవి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 0 క్యూసెక్కులు, బ్యాంక్ కెనాల్‌కు 156 క్యూసెక్కులు, తూర్పు కెనాల్‌కు 170 క్యూసెక్కులు, పశ్చిమ కెనాల్‌కు 125 క్యూసెక్కులు, నిజాంపట్నం కాలువకు 80 క్యూసెక్కులు, కొమ్మమూరు కాలువకు 900 క్యూసెక్కులు విడుదల చేశారు.

కసాయి సాధనపై ఉపేక్షేల!

- సాయిసాధన పుల్లారావు బాధితులకు భరోసానివ్వని పోలీసులు
- కేసు నమోదు మొదలు నిందితుల అరెస్ట్ వరకు నిర్లక్ష్యమే
- ఆర్థిక నేరస్తుడిపై చర్యలకు వెనుకడుగు వేస్తున్న కూటమి సర్కారు
- రూ.400 కోట్ల మోసం చేసిన నిందితుడికి సహకరించిన సీఐపై చర్యలకు పట్టుబడుతున్న బాధితులు
- కేసు సీఐడీకి అప్పగించి చేతులుదులుపుకునే యత్నంలో పోలీసులు
- పుల్లారావు కుటుంబ సభ్యులనూ అరెస్ట్ చేయకపోవడంతో విదేశాలకు పారిపోయే అవకాశం
- ప్రభుత్వ పెద్దలు వెంటనే స్పందించాలంటున్న బాధితులు

మూడు వారాలుగా సాయి సాధన చిట్‌ఫండ్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు ఆర్థిక అరాచకాలపై మీడియాలో కథనాలు వస్తూనే ఉన్నాయి. అతనికి డబ్బులిచ్చిన వారి గుండెలు లబ్‌డబ్ అని భయంతో కొట్టుకుంటూనే ఉన్నాయి. రోజురోజుకూ బాధితుల సంఖ్య రెట్టింపవుతూనే ఉంది. ఇంత జరుగుతున్నా ప్రభుత్వంలో చలనం లేదు. బాధితులు వందల సంఖ్యలో స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేసినా కేసుల నమోదులో పోలీసులు తాత్సారం చేశారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఒక్క ఎఫ్‌ఐఆర్ మాత్రమే నమోదు చేసి మిగిలిన బాధితులను అందులో చేర్చి మమ అనిపించారు. ప్రజల సొమ్ముతో పారిపోయిన పుల్లారావు దర్జాగా వారం రోజులు షికార్లు కొట్టి తాపీగా గుంటూరు కోర్టులో లొంగిపోయాడు. కేసులో నిందితులుగా ఉన్న ఆయన కుటుంబ సభ్యులు జల్సా చేస్తున్నా పోలీసులు పట్టించుకుంటున్న పాపాన పోలేదు. దీంతో వారు విదేశాలకు పారిపోయే అవకాశం లేకపోలేదు. మరోవైపు అప్పులిచ్చిన వారి ఇళ్లలో కన్నీళ్లు పొంగుతున్నాయి. అసలు నేరం చేసిన పుల్లారావు అంత ధీమాగా ఉండదానికి, బాధితులు న్యాయం కోసం రోడ్డెక్కడానికి గల కారణాలను వెతికితే అన్ని వేళ్లూ పోలీసులు, ప్రభుత్వంవైపే చూపెడుతున్నాయి.



సాయిసాధన చిట్‌ఫండ్ నిర్వాహకుడు పాలడుగు పుల్లారావు

సాక్షి, నరసరావుపేట, నరసరావుపేటటౌన్: ఆర్థిక నేరస్తుడు పాలడుగు పుల్లారావు మోసం బయటపడినా అతడి కుటుంబం దర్జా తగ్గలేదు. పోలీసులు తనను వెంటాడుతారనే భయం ఆయన నీడను కూడా తాకలేదు. ఆయన జల్సాలకు ఎవరూ అడ్డు పడలేదు. కనీసం ఎక్కడ ఉన్నావని అడిగిన ఒక్క అధికారీ లేదు. ఇదీ ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న పారదర్శకత. ఎందుకంటే ఒక చిల్లర దొంగతనం జరిగిన వెంటనే.. ఆ దొంగను పట్టుకునేందుకు పోలీసులు వెంటనే స్పెషల్ టీంలు వేస్తారు. ఆ దొంగ వెళ్లే మార్గాలను అన్వేషించి పద్మవ్యూహం రచిస్తారు. చివరకు ఆ దొంగను పట్టేసి.. తాము చేసిన గొప్పల గురించి చెప్పుకుంటారు. మరి పుల్లారావు విషయంలో ఎందుకంత ఉదాసీనత ప్రదర్శించారనేది వేయి డాలర్ల ప్రశ్న.

విదేశాల్లోనూ బాధితులు..

కొద్ది రోజుల క్రితం వరకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లోనే పుల్లారావుకు అప్పులిచ్చిన బాధితులు తాము మోసపోయామని బయటికి వచ్చారు. ఇలా బాధితులు బయటికి వచ్చే కొద్దీ పుల్లారావు ప్రజల నుంచి వసూలు చేసిన నగదు విలువ పెరుగుతూనే ఉంది. ఈ క్రమంలో ఈ నెల 9న నరసరావుపేటలో పుల్లారావు బాధితులు సమావేశమై, భవిష్యత్తు ప్రణాళిక గురించి చర్చించారు. ఈ విషయం రాష్ట్ర వ్యాప్తంగా తెలియడంతో అనంతపురం జిల్లా శింగనమల నుంచి బాధితులు నరసరావుపేట వచ్చారు. తెలంగాణలో ఉంటున్న బాధితులూ బయటికి వచ్చారు. విదేశాల్లో ఉన్న బాధితులు సైతం తమ డబ్బు గురించి ఆరా తీస్తున్నారు. బాధితుల సంఖ్య వెయ్యి మందికిపైగానే ఉంటుందని సమాచారం. పుల్లారావు మొత్తం వసూలు చేసింది రూ.400 కోట్లకుపైగా ఉంటుందని బాధితుల జాబితాలు చెబుతున్నాయి.

చిట్ ఫండ్ స్కామ్‌పై స్పందించని ప్రభుత్వం



నరసరావుపేట కమ్మ హాస్టల్‌లో ఆదివారం సమావేశమైన పుల్లారావు బాధితులు

సీఐపై చర్యలేవి..?

పుల్లారావు వ్యవహారంలో సమీప బంధువు సీఐ అన్నీ తానై వ్యవహారాన్ని చక్కబెట్టినట్టు తెలుస్తోంది. పుల్లారావు అజ్ఞాతంలోకి వెళ్లినప్పటి నుంచి అతనికి షెల్టర్ కల్పించాడట. బాధితులు సీఐపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడంతో తన పోస్టింగ్‌కు ఇబ్బందవుతుందన్న కారణంతో కోర్టులో లొంగిపోయేలా చేశాడు. అంతటితో ఆగకుండా పోలీసు శాఖలో తనకున్న పరిచయాలతో ఉన్నతాధికారులనూ మేనేజ్ చేసి కేసు నీరుగారేలా ప్రణాళిక రచించినట్టు బాధితులు ఆరోపిస్తున్నారు. సీఐపై చర్యలు తీసుకోవాలని బాధితులు ఆదివారం ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబు ఇంటి ఎదుట ధర్నా చేశారు. సీఐ పాత్ర ఉందని తెలిసినా పోలీసు ఉన్నతాధికారులు, ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వెనుక మతలబు ఏంటో అర్థం కావడం లేదు. ఈ కేసులో పుల్లారావుకు అనుకూలంగా వ్యవహరించేందుకు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కొందరు పోలీసులకు పెద్ద మొత్తంలో ముట్టినట్టు బాధితులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. మరోవైపు కేసును సీఐడీకి అప్పగించి చేతులుదులుపుకుందామని పోలీసులు యత్నిస్తున్నారు. ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపినట్టు సమాచారం.

ప్రభుత్వానికి బాధ్యత లేదా ?

వెయ్యి కుటుంబాల జీవితాలు, పిల్లల పెళ్లిళ్లు, చదువులు, అప్పులు, ఆర్థిక భారాలు ఇలా ఒకటేమిటి అన్నీ ఆ డబ్బుతోనే ముడిపడి ఉంటాయి. అలాంటి సొత్తు మొత్తం ఒక ఆర్థిక నేరస్తుడి చేతిలో చిక్కుకుంటే ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం ఏమిటని బాధితులు ప్రశ్నిస్తున్నారు. ఈ కేసును సీఐడీకి ఇవ్వాలనే ఆలోచన పుల్లారావుకు మేలు చేయడానికేనని మండిపడుతున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని, పారదర్శక పాలన అని చెప్పుకుంటున్న సీఎం చంద్రబాబు, డెప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఈ ఘటనపై వెంటనే స్పందించి న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

పుల్లారావు కుటుంబ సభ్యులనూ అరెస్టు చేయాలి

- చిట్‌ఫండ్ కార్యాలయం ఎదుట బాధితుల రాస్తారోకో

నరసరావుపేటటౌన్: విదేశాలకు పారిపోయేందుకు యత్నిస్తున్న సాయిసాధన చిట్‌ఫండ్ నిర్వాహకుడు పుల్లారావు కుటుంబ సభ్యులను వెంటనే అరెస్ట్ చేయాలని బాధితుల సంఘ ప్రతినిధులు యామిని రామారావు, చేకూరి సాంబశివరావు డిమాండ్ చేశారు. న్యాయం చేయాలని కోరుతూ సోమవారం పల్నాడు రోడ్డులోని సాయి సాధన చిట్ ఫండ్ కార్యాలయం ఎదుట బాధితులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవసరాలకు పనికొస్తాయని దాచుకున్న సొమ్ము, చీటీపాటల నగదుతో పుల్లారావు పారిపోయి డబ్బులు ఎగ్గొట్టే ఉద్దేశంతో కోర్టులో లొంగిపోయాడని ఆవేదన వ్యక్తం చేశారు. అతని సమీప బంధువైన సీఐ సహకారంతోనే ఇదంతా జరిగిందని, అతనిపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పుల్లారావు బాధితులు ఏపీ, తెలంగాణ రాష్ట్రాలతోపాటు విదేశాల్లో కూడా ఉన్నారని వివరించారు. పుల్లారావు భార్య, పిల్లలు, అల్లుడు విదేశాలకు వెళ్లేందుకు యత్నిస్తున్నారని, కేసులో నిందితులుగా ఉన్న వారిని కూడా వెంటనే అరెస్ట్ చేసి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. త్వరలో మంత్రి లోకేష్, డెప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌ను కలుస్తామని వివరించారు. రాస్తారోకో విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ విజయ్‌చరణ్ సిబ్బందితో అక్కడికి చేరుకొని ఆందోళనకారులతో చర్చించారు. పుల్లారావు కుటుంబ సభ్యులను త్వరలోనే పట్టుకుంటామని సీఐ హామీ ఇచ్చారు.



ఆందోళన చేస్తున్న బాధితులు

నరసరావుపేట కోర్టుకు పుల్లారావు..

పుల్లారావును నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు పీటీ వారెంట్‌పై మొదటి అదనపు మున్సిఫ్ మేజిస్ట్రేట్ కోర్టులో సోమవారం హాజరు పరిచారు. బాధితులు పుల్లారావుపై దాడి చేస్తారన్న సమాచారంతో భారీ ఎస్కార్ట్ నడుమ తరలించారు. కోర్టులో పని ఉన్న కక్షిదారులను మినహా ఇతరులను అనుమతించలేదు. న్యాయమూర్తి పుల్లారావుకు 14 రోజుల రిమాండ్ విధించి, కేసును ఈనెల 21కి వాయిదా వేశారు. నిందితుడిని 20 రోజులపాటు కస్టడీకి ఇవ్వాలని సీఐ న్యాయమూర్తిని కోరారు. దీనిపై రెండు రోజుల్లో నిర్ణయం తీసుకోనున్నారు. నిందితుడిని తిరిగి గుంటూరు జైలుకు తరలించారు.

మృత్యుంజయులు

- 16 మంది కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్ క్షేమం
- ట్రాక్టర్ బోల్తా ప్రమాదం నుంచి బతికి బయట పడిన వైనం
- సమయస్ఫూర్తితో కాపాడిన యువకులు

ముప్పాళ్ళ: బొల్లవరం మేజర్ కట్టపై ఆదివారం ట్రాక్టర్ బోల్తా పడిన ఘటనలో చాగంటివారిపాలెంకు చెందిన 16 మంది కూలీలు, ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. మృత్యుంజయులై నిలిచారు. బతుకు జీవుడా అంటూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనలో నలుగురు మహిళా కూలీలు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. మిగిలిన వారిని కొందరు యువకులు సమయస్ఫూర్తితో కాపాడారు. రోజూ చాగంటివారిపాలెం నుంచి కూలీలు మిరప కోతలకు ఆటోలో వెళ్లి వస్తుంటారు. ఆదివారం ఉదయం కూడా ఆటోలోనే బొల్లవరంలో మిరప కోత పనులకు వెళ్లారు. సాయంత్రం చీకటి పడుతుండడంతో ఇంటికి వెళ్లాలనే ఆతృతతో మిర్చి టిక్కీల కోసం వచ్చిన ట్రాక్టర్ ఎక్కారు. ట్రాక్టర్ బొల్లవరం సమీపంలోని మేజర్ కట్టపైకి రాగానే గుంతలు ఉండడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ట్రాక్టర్ తిరగబడిన తీరు ప్రమాద తీవ్రతకు నిదర్శనంగా ఉంది. ఆ దృశ్యం చూపిన వారిని గగుర్పాటుకు గురిచేసింది. ప్రమాద విషయం తెలిసిన చాగంటివారిపాలెంకు చెందిన యువకులు ద్విచక్రవాహనాలు, ఆటోల్లో వెళ్లి ట్రాక్టర్ కింద, మిరప టిక్కీల్లో ఇరుక్కుపోయిన 16 మందిని సురక్షితంగా బయటకు లాగటంతో బయట పడ్డారు. ట్రాక్టర్ డ్రైవర్ కూడా స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ట్రాక్టర్ టైర్ల కింద ఇరుక్కొని ఉన్న మృతదేహాలను మాత్రం జేసీబీ సాయంతోపైకి లేపి బయటకు తీశారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడిన యువకులను గ్రామస్తులు అభినందించారు. రెప్పపాటులో ప్రమాదం జరిగిందని, కొద్దిసేపు ఆలస్యమైనా ప్రాణాలు గాల్లో కలిసిపోయేవని ప్రమాదం నుంచి బయట పడిన వారు చెబుతున్నారు. విషాద ఘటనను గుర్తుతెచ్చుకుని కన్నీరు పెడుతున్నారు.



ప్రమాద స్థలంలో బోల్తా కొట్టిన ట్రాక్టర్ (ఫైల్)

ఏం జరిగిందో అర్థం కాలేదు



ట్రాక్టర్‌లో ఇంటికి వస్తుండగా ఒక్కసారిగా కుదుపు వచ్చి ట్రాక్టర్ బోల్తా పడింది. అందులో కూర్చున్న మేమంతా దూరంగా నీళ్లలో పడ్డాం. ఊపిరి పోయిందనుకున్నాం. కొద్ది సేపటికి మా ఊరు పిల్లలు వచ్చి మంచినీళ్లు ఇచ్చారు. అప్పటి దాకా స్పృహ లేదు. ఏం జరిగిందో కూడా అర్థం కాలేదు. అసలు బతికి ఉన్నామా లేదా అనిపించింది.

– ఆనెకల్లు హైమావతి, అన్నపురెడ్డి అచ్చమ్మ

చాలా భయమేసింది



రోజులాగే మిరప టిక్కీలతో ట్రాక్టర్ బయలుదేరింది. నేను చేలోనే ఉన్నాను. కట్టపైకి వెళ్లగానే ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తా పడిందని కూలీలు కేకలు వేశారు. అక్కడికి వెళ్లి ఆ దృశ్యం చూసే సరికి చాలా భయమేసింది. కళ్ల వెంట నీళ్లువచ్చాయి. ఒక్కడినే ఉండటంతో శక్తి మేర కొంత మందిని బయటకు తీస్తూ ఊరిలోకి ఫోన్ చేసి చెప్పా. కొంచెం సేపటికి కొంతమంది రావటంతో బలవంతంగా ట్రాక్టర్‌నుపైకి లేపి మిర్చి టిక్కీలలో ఇరుక్కున వారిని బయటకు లాగి కాపాడ గలిగాం.

– మువ్వా శ్రీకాంత్, పొలం కౌలురైతు

ఒక్కసారిగా పడి పోయింది



మిరప కోత పూర్తి కావటంతో క్యారేజీలు తీసుకొని పొలం బయటకు వచ్చాం. ఆటోలో కొంతమంది ఎక్కారు. మిగిలిన వాళ్ళ మంతా రెండో ట్రిప్పులో వెళదామనుకుంటుండగా ట్రాక్టర్‌పై వెళదామని ఎవరో అనటంతో అందరం ఎక్కాం. కొంచెం దూరం రాగానే ఒక్కసారిగా బోల్తా పడింది. నా పైన మిరపకాయ టిక్కీలన్నీ పడటంతో తప్పించుకో కలిగా.

– కలగొట్ల రామలింగమ్మ, ప్రమాదం నుంచి బయటపడ్డ మహిళ

చేయిపై జనం పడ్డారు



కాల్వ కట్టపై వెళుతున్న ట్రాక్టర్ బోల్తా కొట్టడంతో అందులో కూర్చొన్న నేను ఎగిరి దూరంగా పడ్డా. నా పక్కనే ఉన్న వారంతా నా చేతి పైన పడ్డారు. కాసేపు ఏం జరిగిందో కూడా తెలియలేదు. ఊపిరి పోయిందనుకున్నా. బతికి బయటపడ్డా.

–మధిర ఉష, బయట పడ్డ వ్యవసాయకూలీ

ట్రాక్టర్‌ను పైకి లేపి బయటకు లాగాం



మిర్చి ట్రాక్టర్ బోల్తా పడిందని ఆ పొలం చేసే శ్రీకాంత్ ఫోన్ చేశాడు. వెంటనే నా పక్కనే ఉన్న వారికి చెప్పి బండిపై వెళ్లే సరికి ట్రాక్టర్ కింద జనాలు ఉన్నారు. ఇద్దరం ట్రాక్టర్‌ను, ఇద్దరం మిరప టిక్కీలను పైకి లేపి వాటి కింద ఉన్న వారిని కాపాడాం.

– తమలపాకుల సుమంత్, కాపాడిన వ్యక్తి, చాగంటివారిపాలెం

ఏసీబీకి చిక్కిన ఎంఈఓ



చిలకలూరిపేట: విశ్రాంత ఉపాధ్యాయుడి నుంచి లంచం తీసుకుంటూ చిలకలూరిపేట ఎంఈఓ సోమవారం ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఏసీబీ అడిషనల్ ఎస్పీ మహేంద్రమత్తే కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన చల్లా వెంకట శ్రీనివాసరావు ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్లో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా 37 ఏళ్లు పనిచేసి గతేడాది జులై 31న రిటైర్ అయ్యారు. ఆయనకు ఆర్జిత సెలవులు, ఇతర బకాయిల ద్వారా రూ.8.22 లక్షలు రావాల్సి ఉంది. దీనికి సంబంధించి బిల్లు చేసేందుకు చిలకలూరిపేట మండల విద్యాధికాఖాధికారిగా ఉన్న కె.లక్ష్మి రూ.30 వేలు లంచం డిమాండ్ చేసింది. ఆర్‌వీఎస్ సీవీఎస్ హైస్కూల్‌లోనే జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న మాజేటి వెంకట శ్రీనివాసరావు ద్వారా డబ్బులు చెల్లించాలని కోరారు. బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో చల్లా వెంకట శ్రీనివాసరావు రూ.30 వేలు మాజేటి వెంకట శ్రీనివాసరావు ద్వారా ఎంఈఓ కె.లక్ష్మికి ఆమె నివాసంలో అందజేశాడు. అదే సమయంలో ఏసీబీ అధికారులు దాడి చేసి ఎంఈఓతోపాటు ఆమెకు సహకరించిన మాజేటి వెంకట శ్రీనివాసరావును అదుపులోకి తీసుకున్నారు. కార్యక్రమంలో ఏసీబీ సీఐలు నాగరాజు, మన్మధరావు, సురేష్, సుబ్బారావు సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం


- మొత్తం 40 మంది 69 నామినేషన్లు
- చివరిరోజున 22 మంది అభ్యర్థుల నామినేషన్లు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలోని కృష్ణా – గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గానికి సంబంధించి నామినేషన్ల స్వీకరణ గడువు సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు ముగిసింది. చివరిరోజున పెద్దఎత్తున నామినేషన్లు దాఖలయ్యాయి. సోమవారం ఒక్కరోజే 22 మంది అభ్యర్థులు 43 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల ఘట్టం ముగిసే సమయానికి 40 మంది అభ్యర్థులు 69 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ల పరిశీలన మంగళవారం ఉదయం 11 గంటలకు చేపడతారు. ఈ నెల 27న ఎన్నిక జరగనుంది. ప్రధానంగా పోటీ ప్రస్తుత ఎమ్మెల్సీగా ఉన్న కె.ఎస్. లక్ష్మణరావు, తెలుగుదేశం అభ్యర్థి ఆలపాటి రాజా మధ్య జరగనుంది. అన్ని రంగాల నుంచి పలువురు పోటీలో నిలబడ్డారు. కె.ఎస్. లక్ష్మణరావు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నారు. ఆయనకు వామపక్షాలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాలు మద్దతు ప్రకటించాయి. కాంగ్రెస్ పార్టీ తరపున మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీ మద్దతు ప్రకటించారు. మరోవైపు జనసేన పార్టీకి చెందిన ఆయన పూర్వ విద్యార్థులు కూడా వచ్చి సంఘీభావం ప్రకటించి, సన్మానించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. వలంటీర్లను కూటమి ప్రభుత్వం మోసం చేసిన నేపథ్యంలో కృష్ణా జిల్లా నుంచి వలంటీరు ఒకరు బరిలో నిలబడ్డారు.

మండలి రాజకీయ నిరుద్యోగులకు వేదిక కావొద్దు

- కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలి
- పీడీఎఫ్ ఎమ్మెల్సీలు ఐ.వెంకటేశ్వరరావు, బొర్రా గోపీమూర్తి
- గుంటూరులో నామినేషన్ వేసిన లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: శాసనమండలి రాజకీయ నిరుద్యోగులకు వేదిక కారాదని పీడీఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు అన్నారు. శాసనమండలి కృష్ణా – గుంటూరు పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పీడీఎఫ్ తరపున కేఎస్ లక్ష్మణరావు సోమవారం నామినేషన్ వేశారు. గుంటూరు మార్కెట్ సెంటర్‌లోని శ్రీవేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సభ నిర్వహణ అనంతరం వందలాది మంది మద్దతుదారులతో కలిసి జిల్లా కలెక్టరేట్‌కు ర్యాలీగా తరలివెళ్లారు. ముందుగా యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజా పోరాటాల ద్వారానే పాలకుల మైండ్‌సెట్ మార్చగలమన్నారు. అధికార పార్టీ నుంచి వచ్చిన వ్యక్తి ఎమ్మెల్సీగా మండలిలో అడుగుపెడితే ప్రజా సమస్యలను ప్రభుత్వాన్ని నిలదీయగలరా అని అన్నారు. మరో ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి మాట్లాడుతూ గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ స్థానాలకు సైతం రాజకీయపార్టీలు అభ్యర్థులను పోటీకి దింపడం తగదని, ప్రజల తరపున గళం విన్పించగలిగే సత్తా గల నేతలే మండలిలో అడుగుపెట్టాలన్నారు.



గుంటూరు కలెక్టర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

ఉద్యమాలతో ప్రభుత్వాల మెడలు వంచుతాం..

మాజీ ఎమ్మెల్సీ వి.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రజా ఉద్యమాలతోనే ప్రజా వ్యతిరేక ప్రభుత్వాల మెడలు వంచగలమన్నారు. అనంతరం పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ పోటీలో తనకు ఎదురుగా ఎవరున్నా తాము భయపడే ప్రసక్తే లేదని అన్నారు. కృష్ణా–గుంటూరు జిల్లాల్లో ఉన్న 3.46 లక్షల గ్రాడ్యుయేట్ ఓటర్లు ఈనెల 27న జరిగే ఎన్నికల్లో చక్కటి తీర్పు ఇస్తారన్నారు. కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి, జనసేన నాయకుడు చందు కేఎస్ లక్ష్మణరావుకు మద్దతు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

జిల్లా స్థాయి రోడ్డు సేఫ్టీ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశం



రోడ్డు భద్రత అవగాహన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్, రవాణా, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవేస్, ఆరోగ్య శాఖలు సమన్వయంతో పనిచేయాలని డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ చైర్మన్, కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు పలు సూచనలు చేశారు. గుర్తించిన బ్లాక్ స్పాట్లలో నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నారని, ఫోన్ మాట్లాడుతూ డ్రైవ్ చేసేవారి పట్ల కఠినంగా వ్యవహరించాలని, హెల్మెట్ ధరించేలా చూడాలని పోలీస్, రవాణా శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. రొంపిచర్ల వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఎక్స్‌ప్రెస్ వేపై ఫ్లైఓవర్ నిర్మాణానికి అవకాశాలను పరిశీలించాలని ఇంజినీరింగ్ అధికారులను కోరారు. ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతు యూ టర్న్ దగ్గర సైన్ బోర్డులు, రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. అనంతర నోడల్ అధికారి ఈ-డీఏఆర్ యాప్‌పైన అవగాహన కల్పించారు. రోడ్డు భద్రత అవగాహనపై నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఎన్.సంజీవకుమార్, ఆర్ అండ్ బి ఇ.ఇ రాజా నాయిక్, ఆర్టీసీ ఆర్ఎం శ్రీనివాసరావు, రోడ్ సేఫ్టీ ఎన్‌జీవో దుర్గాపద్మజ పాల్గొన్నారు. అనంతరం తన చాంబర్‌లో ఉద్యానశాఖ అధికారుల అసోసియేషన్ నూతన డైరీలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి సీహెచ్.వి.రమణారెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తిచేయండి

కలెక్టర్ కార్యాలయంలో సోమవారం జిల్లా స్థాయి ఆధార్ కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ 0-5ఏళ్ల మధ్యనున్న వారి ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తిచేయాలని, 0-5 ఏళ్ల నుంచి 15 నుంచి 17 ఏళ్ల మాండేటరీ బయోమెట్రిక్ పెండింగ్స్ కూడా పూర్తిచేయాలని సూచించారు. మొత్తం పల్నాడు జిల్లాలో 107 ఆధార్(థంబ్ ఇంప్రెషన్ మిషన్, ఐరిస్ యంత్రం, కంప్యూటర్) కిట్లు ఉంటే వాటిలో 63 కిట్లు వివిధ మండలాల్లో పనిచేస్తున్నాయని, మిగతా 44 కిట్లు హార్డ్‌వేర్ సమస్య వల్ల పనిచేయడం లేదని, వీటిని పనిచేయించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ఆధార్ సెంటర్ల ఆపరేటర్లు ప్రూఫ్ ఆఫ్ డాక్యుమెంట్స్ అప్లోడ్ చేసేటప్పుడు ఎర్రర్స్, పెనాల్టీస్‌ని తగ్గించేందుకు ప్రాపర్‌గా తనిఖీచేసిన తర్వాతనే అప్లోడ్ చేయాలని, ప్రైస్ చార్టును ప్రతి ఆధార్ కేంద్రంలోనూ తప్పనిసరిగా డిస్‌ప్లే చేయాలని ఆదేశించారు. జిల్లా జీఎస్ డబ్ల్యూఎస్ ఆఫీసర్ ఎం.వెంకటరెడ్డి, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ (ఆధార్) ఎం రమేష్‌లకు మిగతా అధికారులు సహకరించాలని కలెక్టర్ ఆదేశించారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి చేతిరాత పరీక్షలో కంతేరు విద్యార్థిని ప్రతిభ



కంతేరు(తాడికొండ): రాష్ట్రస్థాయిలో నిర్వహించిన చేతిరాత పరీక్షలో తమ పాఠశాల విద్యార్థిని ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించిందని కంతేరు జడ్పీ హైస్కూల్ హెచ్ఎం టి.పద్మావతి తెలిపారు. ఈ నెల 8వ తేదీన గుంటూరులోని హిందూ కళాశాలలో గుడ్ కాలీగ్రాఫర్స్ కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి కాలీగ్రాఫ్ (చేతిరాత) పోటీలలో పాల్గొన్న తమ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ద్వితీయ బహుమతి పొందడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో పలువురు ఉపాధ్యాయులు, సొసైటీ మాజీ చైర్మన్ వాసిరెడ్డి జయరామయ్య తదితరులు విద్యార్థినిని అభినందించారు. విద్యార్థినికి గైడ్‌గా వ్యవహరించిన ఉపాధ్యాయుడు ఎ.వెంకటరెడ్డిని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో విద్యాకమిటీ చైర్మన్ ఎ.విజయ్, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

అక్రమంగా విద్యుత్ వాడితే కఠిన చర్యలు



కాకుమాను: నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్‌ను వినియోగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాపట్ల జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ జి.ఆంజనేయులు అన్నారు. పెదనందిపాడు మండలంలోని పలు గ్రామాలలో సోమవారం విద్యుత్ శాఖ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆంజనేయులు మాట్లాడుతూ గృహవసరాలకు, వాణిజ్య సముదాయాలకు విద్యుత్ కనెక్షన్‌లు పొందిన వారు నిబంధనలకు అనుగుణంగా వినియోగించాలన్నారు. పబ్లిక్ పోల్స్‌పై కనెక్షన్‌లను ఏర్పాటు చేసుకుని, విద్యుత్ మీటర్లు తిరగకుండా చేస్తే అటువంటిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. అధికారులు 35 బృందాలుగా ఏర్పాడి 1176 ఇంటి సర్వీసులను, 5 వాణిజ్య మీటర్లను తనిఖీ చేసి 405 సర్వీసు మీటర్లు అనుమతించిన లోడు కంటే అదనంగా విద్యుత్‌ను ఉపయోగిస్తున్నట్లు గుర్తించి రూ.15.72 లక్షల అపరాధ రుసుము విధించారు. దాడుల్లో విజిలెన్స్ శాఖ అధికారి మల్లిఖార్జున్, పొన్నూరు ఏడీఈ శ్యామ్ కుమార్, ఏఈ బి.వీరాంజనేయులు పాల్గొన్నారు.

మహిళా కూలీల మృతి బాధాకరం


వైద్యశాలలో మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి

ప్రగాఢసానుభూతి తెలిపిన డాక్టర్ సుధీర్‌భార్గవ్‌రెడ్డి

సత్తెనపల్లి: పొట్టకూటి కోసం మిరపకాయలు కోసేందుకు వెళ్లిన మహిళా కూలీలు నలుగురు మృతి చెందడం బాధాకరమని వైఎస్సార్ సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్‌రెడ్డి పేర్కొన్నారు. ముప్పాళ్ళ మండలం బొల్లవరం కాలువ కట్టపై ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన మహిళ కూలీల మృతదేహాలను పట్టణంలోని ఏరియా వైద్యశాలలో సోమవారం ఆయన సందర్శించి మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాట్లాడుతూ మృతుల కుటుంబాలను ఓదార్చి వారికి అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించి ఆదుకోవాలని కోరారు. ఆయనతోపాటు వైఎస్సార్ సీపీ ముప్పాళ్ళ మండల అధ్యక్షుడు నక్కా శ్రీనివాసరావు, నాయకులు ఎంజేఎం రామలింగారెడ్డి (చిన్నా), గోలమారి వెంకట్రా మిరెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.


గంగమ్మ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న భార్గవ్‌రెడ్డి

మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

చాగంటివారి పాలెం(ముప్పాళ్ళ): ట్రాక్టర్ బోల్తా ప్రమాదంలో మృతి చెందిన నలుగురు వ్యవసాయ కూలీల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త గజ్జెల సుధీర్‌భార్గవరెడ్డి చెప్పారు. సోమవారం గ్రామానికి వచ్చిన ఆయన నాలుగు మృతదేహాలను సందర్శించి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. మరణించిన మాధవి ఇద్దరు చిన్నారులకు అండగా ఉంటానని చెప్పారు. ఒక్కో కుటుంబానికి రూ.10వేల ఆర్థిక సాయం అందించారు. అనంతరం ప్రమాదంలో గాయపడిన రామలింగమ్మ ఇంటికి వెళ్ళి వైద్యసేవలందించి, మెరుగైన వైద్యం కోసం నరసరావుపేటలోని వైద్యశాలకు రావాలని సూచించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఎమ్‌జెఎమ్‌రామలింగారెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి, మధిర శ్రీనివాసరెడ్డి, మధిర వెంకటేశ్వరరెడ్డి, రెండెద్దుల వెంకటేశ్వరరెడ్డి ఉన్నారు.

బీసీ సంక్షేమ సంఘం యువజన అధ్యక్షుడిగా గంగరాజు



నిజాంపట్నం: బీసీ సంక్షేమ సంఘం బాపట్ల జిల్లా యువజన అధ్యక్షుడిగా నిజాంపట్నానికి చెందిన పచ్చపట్ల గంగరాజు నియమితులయ్యారు. ఈ మేరకు బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మరి క్రాంతి కుమార్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు సోమవారం ప్రకటించారు. ఆయన ప్రమాణ స్వీకారం ఈ నెల 13న నిజాంపట్నంలో జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య ఆధ్వర్యంలో జరుగుతుందని పేర్కొన్నారు. గంగరాజుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

బంగారు పతకం సాధించిన అనూరాధకు సన్మానం



కర్లపాలెం: ఏషియన్ గేమ్స్‌లో షూటింగ్ బాల్ పోటీలలో బంగారు పతకం సాధించి దేశానికి, రాష్ట్రానికి పిట్టు అనూరాధరెడ్డి మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని ఏట్రవారి పాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి తెలిపారు. నేపాల్‌లో ఫిబ్రవరి 2,3వ తేదీల్లో జరిగిన ఏషియన్ గేమ్స్‌లో ఇండియా జట్టులో పిట్టు అనూరాధరెడ్డి ఆడి బంగారు పతకం సాధించింది. ఆమెను సోమవారం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి, శ్రీనివాసరెడ్డి దంపతులు శాలువా కప్పి, పూలమాలతో సన్మానించారు. క్రీడల్లో మరిన్ని పతకాలు సాధించి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు.

వృద్ధురాలి హత్య కేసులో మనవడి అరెస్టు

రేపల్లె రూరల్: వృద్ధురాలి హత్య కేసులో మనవడిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో సోమవారం ఆయన వివరాలను వెల్లడించారు. పట్టణంలోని 3వ వార్డు మున్సుబువారిపాలేనికి చెందిన పసుపులేటి సరస్వతిని ఆదివారం అర్ధరాత్రి ఆమె మనవడు (మైనరు) మద్యం మత్తులో ఇంటికి వెళ్లి గొడవ పడ్డాడు. కూరగాయలు కోసుకునే కత్తితో పీక కోసి హతమార్చాడు. అనంతరం ఇంట్లోని రూ.60వేలను ఎత్తుకు పోయాడు. మృతురాలి చిన్న కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశామని, మృతురాలి భర్త వెంకటేశ్వరరావు మొదటి భార్య కుమారుడి కొడుకు ఈ హత్యకు పాల్పడ్డాడని తేలిందని చెప్పారు. బాలుడిని అరెస్ట్ చేసి, హత్యకు ఉపయోగించిన చాకు, అపహరించిన నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. జిల్లా ఎస్పీ, బాపట్ల డీఎస్పీ సూచనలతో నూతన టెక్నాలజీని వినియోగించి 24 గంటల్లో కేసును ఛేదించామని చెప్పారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు


న్యూ కేటగిరిలో మొదటి స్థానంలో నిలిచిన బాపట్ల ఎడ్లు

మాచవరం: మోర్జంపాడులో లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవాల సందర్భంగా నిర్వహిస్తున్న ఒంగోలు జాతి వృషభరాజముల జాతీయ స్థాయి బండలాగుడు పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. జూనియర్ విభాగం పోటీలను సోమవారం మాజీ ఎమ్మెల్సీ, టీటీడీ పాలక మండలి సభ్యుడు జంగా కృష్ణమూర్తి ప్రారంభించారు. తొలుత ఆయన గ్రామంలోని శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని పూజలు చేశారు.

– ఆరుపళ్ల విభాగంలో అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణ చౌదరి (వేటపాలెం, చుండూరు మండలం, బాపట్ల జిల్లా) ఎడ్లు 5120.9 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ స్థానంలో నిలిచాయి. రామినేని రత్తయ్య చౌదరి (తోటపాలెం, చేబ్రోలు మండలం, గుంటూరు), ఏటుకూరి శ్రీనివాసరావు (పెదకూరపాడు, పల్నాడు జిల్లా) కంబైన్డ్ జత 4234.6 అడుగులు దూరాన్ని లాగి రెండో స్థానంలో నిలిచాయి. అనంతనేని శ్రీకావ్య శ్రీమధు (యనమలకుదురు, పునమలూరు, కృష్ణా జిల్లా) ఎడ్లు 4214.2 అడుగులు, గరికపాటి లక్ష్మయ్యచౌదరి (పెదగొట్టిపాడు, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా), రాయుడు సుబ్బారావు (గంగపాలెం,బల్లికురవ మండలం, బాపట్ల జిల్లా) కంబైన్డ్ జత 4191.2 అడుగులు, నలమాద ఉత్తమ పద్మావతిరెడ్డి (ఎమ్మెల్యే, కోదాడ, తెలంగాణ) ఎడ్లు 4000 అడుగులు, మేకా అంజిరెడ్డి (చల్లగుండ్ల, నెకరికల్లు మండలం, పల్నాడు జిల్లా) ఎడ్లు 3963.9 అడుగులు, కంచేటి రాజ్యలక్ష్మి శ్రీనివాసరావు (గుమ్మడిదూరు, పెదకంచిప్రోలు మండలం, ఎన్టీఆర్ జిల్లా) ఎడ్లు 2600 అడుగుల దూరాన్ని లాగి వరుస బహుమతులు అందుకున్నాయి.

■ న్యూ కేటగిరి సేద్యం విభాగంలో అత్తోట శిరీషచౌదరి, శివకృష్ణ చౌదరి (వేటపాలెం, చుండూరు మండలం, బాపట్ల జిల్లా) ఎడ్లు 4935.6 అడుగుల దూరాన్ని లాగి ప్రథమ బహుమతిని దక్కించుకున్నాయి. వజ్రాల తేజశ్రీరెడ్డి (సంతమాగులూరు, బాపట్ల జిల్లా), ఎడ్లు 4800 అడుగుల దూరాన్ని లాగి రెండో స్థానంలో నిలవగా, తోట శ్రీనివాసరావు (కొప్పురావూరు, పెదకాకాని మండలం, గుంటూరు) ఎడ్లు 4754.9 అడుగులు, గరికపాటి లక్ష్మయ్యచౌదరి (పెదగొట్టిపాడు, ప్రత్తిపాడు మండలం, గుంటూరు జిల్లా) ఎడ్లు 4400 అడుగులు, సంపటం వీరబ్రహ్మం నాయుడు (ఉయ్యందన, క్రోసూరు మండలం, పల్నాడు జిల్లా, ఎడ్లు 4302.3 అడుగులు, కొలుసు శ్రీనివాసరావు యాదవ్, వెంకటేశ్వర యాదవ్ (తెంపల్లి, గన్నవరం, కృష్ణా జిల్లా) ఎడ్లు 4200 అడుగులు, జక్కుల సహస్ర యాదవ్, డాక్టర్ హుస్సేన్ (కోదాడ, తెలంగాణ4068.1 అడుగుల దూరాన్ని లాగి వరుస స్థానాల్లో నిలిచి, బహుమతులు అందుకున్నాయి.

స్టేట్ కరాటే చాంపియన్ షిప్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో స్టేట్‌వైస్ ప్రెసిడెంట్ నల్లూరు మోహన్‌రావు తదితరులు

సత్తెనపల్లి: రాష్ట్ర స్థాయి కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో సత్తెనపల్లి విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కృష్ణా జిల్లా విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో స్పోర్ట్ కరాటే డు, ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో స్టేట్ కరాటే ఛాంపియషిప్ ఈ నెల 9న జరిగింది. ఈ టోర్నీలో సత్తెనపల్లికి చెందిన షీకోకాయ్ షిటోరియో కరాటే స్కూలు విద్యార్థులు 11 మంది విజయఢంకా మోగించారు. కటా విభాగంలో 11 మంది ప్రతిభ చూపి గెలుపొందారు. వీరిలో ఎనిమిది మంది విద్యార్థులు జూన్‌లో డిల్లీలో జరిగే జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. వ్యక్తిగత బాలికల కటా విభాగంలో 13 ఏళ్ల కేటగిరిలో ఎం.దేవిశ్రీ (గోల్డ్‌మెడల్), 12 ఏళ్ల కేటగిరిలో డి.బాలవైష్ణవి (గోల్డ్‌మెడల్), 10 ఏళ్ల కేటగిరిలో బి.అక్షయారెడ్డి (గోల్డ్‌మెడల్), 14 ఏళ్ల కేటగిరిలో టి.నిఖిత (సిల్వర్‌మెడల్) సాధించారు. వ్యక్తిగత బాలుర కటా విభాగంలో 12 ఏళ్ల కేటగిరిలో బి.సత్యనారాయణ(గోల్డ్‌మెడల్), బి.టిష్యంత్(గోల్డ్‌మెడల్), ఎమ్‌వీ బాలాజీ (గోల్డ్‌మెడల్), 11 ఏళ్ల కేటగిరిలో ఎస్.ఎం.ఎస్.దినేష్ (గోల్డ్‌మెడల్), ఎల్.కిదీట్(గోల్డ్‌మెడల్), 12 ఏళ్ల కేటగిరిలో ఎల్.గేష్ఠు అషిత్ (సిల్వర్‌మెడల్), 11 ఏళ్ల కేటగిరిలో, కె.తేజ్‌ప్రకాష్(సిల్వర్‌మెడల్) పతకాలు కై వసం చేసుకున్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులను స్టేట్‌వైస్ ప్రెసిడెంట్ నల్లూరు మోహన్‌రావు, షిహాన్ అనుముల రాంబాబు, అనుముల రామయ్యలు సోమ వారం ప్రత్యేకంగా అభినందించారు.

బాలుడి అన్నవాహికలో ఇరుక్కున్న రూపాయి నాణెం


బాలుడికి ఎండోస్కోపీ నిర్వహిస్తున్న డాక్టర్ ముప్పాళ్ల బలరామ కృష్ణతేజస్వి


బాలుడి అన్నవాహికలో ఇరుక్కున్న రూపాయి నాణెం

ఎండోస్కోపీ ద్వారా తొలగించిన వైద్యులు

చిలకలూరిపేట: మూడేళ్ల బాలుడు మింగిన రూపాయి నాణాన్ని ఆధునిక ఎండోస్కోపి పద్ధతిలో వైద్యులు తొలగించిన ఘటన సోమవారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలోని డాక్టర్ ముప్పాళ్ల హనుమంతరావు ఆస్పత్రిలో జరిగింది. పట్టణానికి చెందిన ఓ మూడేళ్ల బాలుడు ఆడుకుంటూ ఆదివారం రాత్రి రూపాయి నాణెం మింగాడు. రెండో రోజు మలంలో అదే పోతుందిలే అని కుటుంబ సభ్యులు భావించి ఊరుకున్నారు. బాలుడికి కడుపునొప్పి ఎక్కువ కావడంతో సోమవారం ఆస్పత్రికి తీసుకువచ్చారు. రూపాయి నాణెం బాలుడి అన్న వాహికలో ఇరుక్కుపోయినట్లు గుర్తించిన గ్యాస్ట్రో ఎంటరాలజీ వైద్య నిపుణుడు డాక్టర్ ముప్పాళ్ల బలరామకృష్ణ తేజస్వి ఎండోస్కోపీ విధానంలో నాణేన్ని తొలగించారు. ఇటీవల ఎనిమిదేళ్ల బాలుడు పెన్‌క్యాప్ మింగిన సమయంలోనూ ఇదే విధానంలో తొలగించారు. డాక్టర్ బలరామ కృష్ణతేజస్వి మాట్లాడుతూ పిల్లల విషయంలో పెద్దలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పిల్లలకు నాణేలు, బ్యాటరీ రింగ్ సెల్స్, చిన్న చిన్న వస్తువులు అందుబాటులో ఉంచరాదని చెప్పారు. ఒకవేళ పిల్లలు వాటిని పొరపాటున మింగితే అదే తెల్లారి మలంలో పోతుందిలే అని నిర్లక్ష్యం చేస్తే విష రసాయనాలు ప్రమాదం చేకూరుస్తాయని హెచ్చరించారు. ఏదైనా వస్తువు మింగిన ఆరు గంటల లోపు వైద్యులను తప్పనిసరిగా సంప్రదించాలన్నారు.

విజ్ఞాన్ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో ఏప గ్రేడ్


'ఏప గ్రేడ్' సాధించడానికి కృషి చేసిన టీం సభ్యులను అభినందిస్తున్న వర్సిటీ సీఈఓ డాక్టర్ మేఘన

చేబ్రోలు: చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీకి ఐఐటీ మద్రాస్ విడుదల చేసిన జాతీయస్థాయి స్వయం ఎన్‌పీటీఈఎల్ ర్యాంకింగ్స్‌లో 'ఏప గ్రేడ్' లభించిందని వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ సోమవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ స్వయం ఎన్‌పీటీఈఎల్ విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో జాతీయస్థాయిలో 100లోపు ర్యాంక్ సాధించి 'ఏప గ్రేడ్‌ను యూనివర్సిటీ సొంతం చేసుకుందన్నారు. ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన వివిధ రకాల కోర్సులలో తమ విద్యార్థులు పాల్గొని 2814 కోర్సు సర్టిఫికెట్లు సాధించారన్నారు. వీటిలో 51 మందికి టాపర్స్, 29 గోల్డ్, 271 సిల్వర్, 978 ఎలైట్, 1536 మంది సాధారణ ఉత్తీర్ణత సర్టిఫికెట్స్ సాధించారని వెల్లడించారు. 2024వ సంవత్సరంలో ఎన్‌పీటీఈఎల్ నిర్వహించిన వివిధ రకాల కోర్సులలో ఉత్తమ ప్రతిభకు గాను 'ఏప గ్రేడ్' లభించిందని వెల్లడించారు. విజ్ఞాన్స్ యూనివర్సిటీ వరుసగా 7వ సారి 100లోపు ర్యాంక్ సాధించిందన్నారు. 'ఏప గ్రేడ్' సాధించడానికి కృషి చేసిన టీం సభ్యులను విజ్ఞాన్ యూనివర్సిటీ సీఈఓ డాక్టర్ మేఘన కూరపాటి, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తదితరులు అభినందించారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్టు


కేసు వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ నాగేశ్వరరావు

నరసరావుపేటటౌన్ : చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ కె.నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం డీఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. డీఎస్పీ కథనం ప్రకారం.. రొంపిచర్ల మండలం బుచ్చిబాపన్నపాలెం గ్రామానికి చెందిన చల్లా అంజమ్మ ఈ నెల 7న మిరపకాయల పనికి వెళ్లి సాయంత్రం ఇంటికి వచ్చింది. తలుపు తాళాలు తీసి బీరువా పగులగొట్టి ఉండడంతో ఆదుర్దాగా లోపలకి వెళ్లింది. బీరువాలో ఉండాల్సిన బంగారు ఆభరణాలు, రూ.30 వేల నగదు కనిపించలేదు. దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి ఎస్ఐ మణికృష్ణ దర్యాప్తు ప్రారంభించారు. అదే గ్రామానికి చెందిన పల్లెపు విష్ణు 10వ తేదీ ద్విచక్రవాహనంపై వస్తూ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి పారిపోయేందుకు యత్నించాడు. అతన్ని అదుపులోకి తీసుకొని విచారించగా చోరీ తానే చేసినట్లు అంగీకరించాడు. దీంతో చోరీ చేసిన సొత్తును అతని వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నామని డీఎస్పీ వెల్లడించారు. పేకాట, వ్యసనాలకు బానిసై నిందితుడు చోరీలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని వివరించారు.

ఐఏ, ఏడీ సౌత్‌జోన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న నిర్వాహకులు



కర్నాటక - తమిళనాడు జట్ల మధ్య జరుగుతున్న మ్యాచ్

- తొలిరోజు ఆంధ్ర, తెలంగాణ ఉమ్మడి జట్టుపై కేరళ విజయం
- కర్నాటకపై తమిళనాడు జట్టు జయకేతనం

మంగళగిరి: నగర పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లో గల ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ప్రతిష్టాత్మక ఐఏ, ఏడీ సౌత్ జోన్-2025 క్రికెట్ టోర్నమెంట్ మ్యాచ్‌లు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలుత ఆంధ్ర, తెలంగాణ ఉమ్మడి జట్టు - కేరళ రాష్ట్రాల మధ్య మ్యాచ్ జరగగా కేరళ జట్టు విజయం సాధించింది. టాస్ గెలిచిన కేరళ జట్టు బౌలింగ్‌ను ఎంచుకోగా బ్యాటింగ్ చేపట్టిన ఆంధ్ర-తెలంగాణ నిర్ణీత 20 ఓవర్లలో ఏడు వికెట్లు నష్టానికి 96 పరుగులు చేసింది. 97 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన కేరళ జట్టు 18.3 ఓవర్లలో నాలుగు వికెట్లు నష్టపోయి 100 పరుగులు సాధించి జయకేతనం ఎగురవేసింది. ఆంధ్ర-తెలంగాణకు చెందిన బ్యాట్స్‌మెన్ రవితేజ 40 పరుగులు, ఎస్ కొఠారి 26 పరుగులు చేయగా కేరళ జట్టు బౌలర్ అంకిత మిశ్రా 4 ఓవర్లలో 17 పరుగులు ఇచ్చి 4 వికెట్లు తీసి రాణించాడు. రెండవ మ్యాచ్‌లో తమిళనాడు-కర్నాటక జట్లు తలపడగా తమిళనాడు కర్నాటకపై మూడు వికెట్లు తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచిన తమిళనాడు జట్టు బౌలింగ్ ఎంచుకోగా బ్యాటింగ్ చేసిన కర్నాటక జట్టు 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 169 పరుగులు చేసింది. జట్టు బ్యాట్స్‌మెన్ హెచ్.అర్జున్ 47 పరుగులు, శరత్ బీఆర్ 40 పరుగులు జె సుజిత్ 31 పరుగులు చేసి రాణించారు. 170 పరుగుల విజయ లక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన తమిళనాడు జట్టు చివరి ఓవర్ చివర బంతి వరకు ఉత్కంఠభరితంగా జరిగిన పోరులో విజయం సాధించింది. తమిళనాడు జట్టులో భరద్వాజ్ 83 పరుగులు, విఘ్నేష్ 27 పరుగులతో రాణించారు. నిర్వాహకులు భాస్కర్ కల్లూరి, కిషోర్ రెడ్డి, రాకేష్ నాయక్, ఎన్.నిఖిల్‌లు జెండా ఊపి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అదేవిధంగా జాతీయ, అంతర్జాతీయ టోర్నమెంట్‌లలో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన క్రికెటర్ నీలం మణిశ్రావణిని నిర్వాహకులు అభినందించి బహుమతి ప్రదానం చేశారు.

ఆర్‌వీఆర్‌జేసీ కళాశాలకు జాతీయస్థాయిలో ఏప రేటింగ్

రెండు ప్రత్యేక అవార్డులు సైతం..


అవార్డులను చూపుతున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ఎన్‌పీటీఈఎల్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు కనబరిచిన విశేష ప్రతిభకు 12వ సారి తమ కళాశాలకు జాతీయ స్థాయిలో ఏప రేటింగ్, రెండు ప్రత్యేక అవార్డులు రావడం సంతోషంగా ఉందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ మద్దినేనిలు తెలిపారు. చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ అవార్డులతోపాటుగా దేశంలోని అన్ని లోకల్ చాప్టర్స్‌లో తమ కళాశాల అగ్రస్థానంలో నిలవడం గర్వకారణంగా ఉందన్నారు. ఈ ప్రతిష్టాత్మక గుర్తింపులో భాగంగా, కళాశాల విద్యార్థులు 85 గోల్డ్, 1,012 ఎలైట్, 439 సిల్వర్ గ్రేడ్‌లను సాధించడంతోపాటు 62 మంది టాపర్ సర్టిఫికెట్లు పొందారన్నారు. ఇటీవల ఐఐటీ మద్రాస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రతినిధులు ఈ అవార్డులను స్వీకరించారన్నారు. ఎన్‌పీటీఈఎల్ కోర్సులు ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుకునేందుకు అనుకూలంగా ఉంటాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. ఈ కోర్స్‌లలో టాపర్‌గా నిలిచిన విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగ అవకాశాలు దక్కనున్నాయని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా అవార్డులు, జాతీయ స్థాయిలో రేటింగ్‌ను పొందేందుకు కృషిచేసిన అధ్యాపకులు, విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, ఎన్‌పీటీఈఎల్ లోకల్ చాప్టర్ సమన్వయకర్త, సీఎస్‌డీ విభాగాధిపతి డాక్టర్ ఎంవీపీ చంద్రశేఖర్ తదితరులు అభినందించారు.

వేర్వేరు ప్రమాదాలలో ఇద్దరు మృతి

కాకుమాను: రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాలలో ఇద్దరు మృతి చెందిన ఘటనలు ఆదివారం రాత్రి జరిగాయి. ఎస్ఐ ఏక్‌నాథ్ కథనం ప్రకారం.. కాకుమానుకు చెందిన పినపాల చలం(59) ద్విచక్ర వాహనంపై పెదనందిపాడు నుంచి కాకుమాను వస్తుండగా కాకుమాను సమీపంలో నిలిపి ఉన్న ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

■ కొండపాటూరుకు చెందిన ఆటో డ్రైవర్ బొలిమేర లెనిన్(24) ఆటో అదుపుతప్పి బోల్తాపడి మృతి చెంది చెందినట్లు ఎస్ఐ తెలిపారు.